## గణేష్ మండపాల వద్ద పూజలు, అన్నదానాలు





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

సోమవారం | 21 | సెప్టెంబర్ | 2026

పేజీలు : 8


## పరిశ్రమల కాలుష్యంతో

# ఉక్కిరి బిక్కిరి




- ప్రమాదంలో పర్యావరణం
- అనారోగ్యాల పాలువుతున్న జనం
- భవిష్యత్ తరాల మనుగడపై నీలినీడలు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. కేటిపిఎస్, బిటిపిఎస్ థర్మల్ విద్యుత్ కేంద్రాలు హెవీవాటర్ ప్లాంట్ భద్రాచలం పేపర్ బోర్డు సింగరేణి బొగ్గుగనులు వంటి భారీ పారిశ్రామిక సంస్థలు జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలకు కీలకంగా ఉన్నాయి. అయితే పారిశ్రామలతో పాటు వాటి నుండి వెలువడే ఉద్గారాలు బొగ్గు దుమ్ము బూడిద పారిశ్రామిక


మిగతా 2లో..


## పేదల ఇండ్లను కూల్చడం అన్యాయం




**-పేదల పక్షాన బిఆర్ఎస్ పోరాడుతుంది**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాలకుల నిర్లక్ష్యం, అధికారుల సమన్వయ లోపం పేదల పాలిట శాపంగా మారిందని వారి ఇండ్లను ఇష్టం వచ్చినట్లుగా కూల్చివేస్తున్నారని ఇది అన్యాయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతకు సంబంధించి నోటీసులు ఇచ్చిన బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పేదల ఇండ్లను కూల్చడమే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. నాడు వెలుగుమట్ల ప్రాంతంలో అర్థరాత్రి పేదలు కట్టుకున్న ఇండ్లను కూల్చిన ప్రభుత్వం


మిగతా 2లో..


## ప్రముఖ వైద్యులు జగదీష్ బాబు మృతి





**-కారు ప్రమాదంలో సజీవ దహనం**
**-సూర్యాపేట పిల్లలమర్రి వద్ద ఘటన**
**-పలువురి నివాళి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ వైద్యులు, మమత సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జన్, హెచ్‌వోడి డాక్టర్ కాసకుర్తి జగదీష్‌బాబు కారు ప్రమాదంలో సజీవ దహనం అయ్యారు. వివరాల్లోకి వెళితే... డాక్టర్ జగదీష్‌బాబు ఖమ్మం నుంచి హైదరాబాద్ కారులో వెళ్తుండగా సూర్యాపేట సమీపంలోని పిల్లల మర్రి వద్ద ప్రమాదవశాత్తు జగదీష్ ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. బయటకు వచ్చేందుకు వీలు లేకపోవడంతో కారులోనే డాక్టర్ జగదీష్‌బాబు సజీవ దహనమయ్యాడు. జగదీష్‌బాబు మృతితో ఖమ్మం వైద్య వర్గాల్లో విషాదం అలుముకుంది. న్యూరో సర్జన్‌గా మమత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎంతో మందికి వైద్య సేవలు అందించి ప్రశంసలు అందుకున్నారు. అటువంటి వైద్యులు ఇక లేరు అన్న వార్త విన్న స్థానికులు, పలువురు వైద్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా కొత్తపట్నం సమీపంలోని సంకువారి గుంట గ్రామానికి చెందిన కాసుకుర్తి బాలాజీ సరోజిని దంపతులకు నలుగురు సంతానం. వారిలో చివరి వాడైన జగదీష్ చిన్నతనం నుంచే ఉన్నత చదువులు చదివి తన కుటుంబానికి అండగా నిలవాలనే ఆశయంతో వైద్య వృత్తిని అభ్యసించాడు. ఎంబిబిఎస్, ఎంఎస్, జనరల్ సర్జరీ,


మిగతా 2లో..


## క్రెడిట్ కార్డు సౌకర్యమా..

# అప్పుల ఊబిలోకి దారినా..?

**-దాగి ఉన్న ఛార్జీలతో వినియోగదారుడికి షాక్**

**ప్రజాపక్షం/ తల్లాడ :** చేతిలో నగదు లేకపోయినా కొనుగోళ్లు చేయొచ్చు. అత్యవసర సమయంలో ఆర్థికంగా ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ కొనుగోళ్లు ప్రయాణాలు, బిల్లుల చెల్లింపుల్లో సౌకర్యంగా ఉంటుంది. అందుకే క్రెడిట్ కార్డుల వినియోగం పెరుగుతుంది. అయితే ఇదే కార్డు బిల్లు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం చేస్తే అధిక వడ్డీలు, ఆలస్య రుసుములు, ఇతర ఛార్జీల రూపంలో అదనపు భారం పడే అవకాశం ఉంది.

క్రెడిట్ కార్డు లాభమా...? నష్టమా...? అన్నది కార్డు వల్ల కాకుండా దాన్ని ఎలా ఉపయోగిస్తున్నామన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రతి నెల మొత్తం బకాయిని గడువులోపు చెల్లించే వారికి వడ్డీ భారం తప్పించుకునే అవకాశం ఉంటుంది. కానీ కనీసం చెల్లించాల్సిన మొత్తం మాత్రమే చెల్లిస్తూ బకాయిని ముందుకు తీసుకెళితే ఖర్చు పెరుగుతుంది.

### బిల్లు ఎప్పుడు చెల్లించాలి:

ప్రతి క్రెడిట్ కార్డుకు ఒక బిల్లింగ్ కాలవ్యవధి, దానికి అనుసంధానంగా ఒక చెల్లింపు గడువు ఉంటుంది.




ఖాతా వివరాల్లో చూపించిన గడువు లోపు మొత్తం బకాయిని చెల్లించడం అత్యంత సురక్షితమైన పద్ధతి. అన్ని కార్డులకు ఒకే గడువు ఉండదు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం కార్డు జారీ చేసే సంస్థలు బిల్లింగ్ ఖాతా వివరాల్లో చెల్లించాల్సిన మొత్తం, కనీస చెల్లింపు, గడువు తేదీ, వడ్డీ రేట్లు, ఆలస్య రుసుములు తదితర వివరాలను స్పష్టంగా చూపించాలి.

### కనీస బకాయి చెల్లిస్తే సరిపోతుందా..?

ఇక్కడే చాలా మంది వినియోగదారులు పొరబడుతున్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తికి రూ. 50వేలు క్రెడిట్ కార్డు బిల్లు


మిగతా 2లో..

# పరిశ్రమల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

(మొదటిపేజీ తరువాయి)

వ్యర్థాలు రవాణా కాలుష్యంపై ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బొగ్గు ఆధారిత కేంద్రాలవద్ద ఇందన దహనం, బొగ్గు రవాణా బూడిద నిర్వహణ వంటి కార్యకలాపాలు కాలుష్య నియంత్రణకు నిరంతర పర్యవేక్షణ అవసరాన్ని పెంచుతున్నాయి. దుమ్ము సూక్ష్యం కణాలు, ఇతర ఉద్గారాలు పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యతను ప్రభావితం చేసే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా పరిశ్రమల చుట్టుప్రక్కల నివేశించే ప్రజలు దుమ్ము పొగ వాసన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు నిత్యం చెబుతున్నారు. సింగరేణి బొగ్గు గునల ప్రాంతాల్లో ఓపెన్ కాస్ట్ తవ్వకాలు బొగ్గు రవాణా ఓవర్ బర్డెన్ తరలింపు పేలుళ్లు ఇతర కార్యకలాపాలు దుమ్ము సమస్యకు కారణమయ్యే అవకాశం స్పష్టంగా ఉంది. గనుల కార్యకలాపాలకు గాలి నీటి కాలుష్య నియంత్రణకు పర్యావరణ అనుమతులు పర్యవేక్షణ వ్యవస్థలు అమల్లో ఉన్నాయి. ప్రభుత్వ పర్యావరణ రికార్డుల్లో సింగరేణి సంస్థకి చెందిన కొన్ని ప్రాజెక్టులపై గతంలో పర్యావరణ అనుమతి పరిమితులకు మించి ఉత్పత్తి జరిగిన కేసులు కూడా నమోదైన సందర్భాలున్నాయి. హెవీవాటర్ ప్లాంట్‌కు విషయంలో మాత్రం సంస్థ అధికారికంగా వర్ధ జలాలను శుద్ధి చేసిన తర్వాతే విడుదల చేస్తున్నటుల హైడ్రోజన్ సల్ఫైడ్ స్థాయిలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పరిసర గాలి నాణ్యతను కూడా పరిలీస్తున్నట్లు వెల్లడించింది.

భద్రాచలం పేపర్ బోర్డు వ్యర్థ జలాలు గోదావరి జలాల్లో కలవడం వల్ల ప్రజలు అనేక రోగాల భారిన పడుతున్నారు. ఇదేక్రమంలో చర్మవ్యాధులు సోకడంతో పాటు పశువులు కూడా దీర్ఘకాలిక రోగాల భారన పడుతున్నాయి. గోదావరి తీరంలో హెవీవాటర్ ప్లాంట్, పేపర్ బోర్డు పరిశ్రమల ప్రభావంపై పర్యావరణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వనరులపై ప్రభావం పడుతుందని స్పష్టం చెబుతున్నారు. పలు సందర్భాల్లో కాలుష్య నియంత్రణ మండలి వచ్చి తనిఖీలి చేపట్టన సందర్భాలున్నాయి. పరిశ్రమల చుట్టుప్రక్కల ఉండే ప్రజలకు కాలుష్యంపై సమాచారం అందుబాటులో ఉండటం అవసరం. పరిశ్రమల నుండి వెలువేడ గాలి ఉద్గారాలు వ్యర్థ జలాలు భూగర్భ జలాల నాణ్యత బడిద నిర్వహణ బొగ్గు రవాణా మార్గాల్లో దుమ్ము నియంత్రణ వంటి ప్రమాణాలు పాటిస్తున్నామని ధృవీకరణతో పాటు పరిసర గ్రామాల్లో స్వతంత్రంగా గాల నీరు నేల నమూనాలను పరీక్షించి ఫలితాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధికి పరిశ్రమలు అవసరమే అయినప్పటికీ ప్రజారోగ్యం పర్యావరణ పరిరక్షణ అంతే ముఖ్యం. పారిశ్రామిక అభివృద్ధి పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించేందుకు కాలుష్య నియంత్రణ సంస్థలు పరిశ్రమల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు పర్యావరణ నిపుణలు కోరుతున్నారు. భద్రాద్రి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి సురక్షితమై నీరు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే కాలుష్య నియంత్రణను కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# క్రెడిట్ కార్డు సౌకర్యమా.. అప్పుల ఊబిలోకి దారినా..?

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిందనుకుందాం. ఖాతా వివరాల్లో కనీస చెల్లింపు రూ. 2,500గా ఉంటే కేవలం రూ. 2,500 చెల్లించి మిగిలిన మొత్తాన్ని వదిలేయడం అంటే అప్పు పూర్తిగా తీరినట్లు కాదు.మిగిలిన బకాయిపై కార్డు నిబంధనల ప్రకారం వడ్డీ పడవచ్చు.అంతేకాకుండా మొత్తం బకాయిని గడువు లోపు చెల్లించకపోతే వడ్డీ లేని రుణ కాల వ్యవధి కోల్పోయే అవకాశం ఉంది. ఆర్‌బిఐ కూడా ప్రతి నెల కేవలం కనీసం చెల్లించాల్సిన మొత్తం చెల్లించడం వల్ల రుణ చెల్లింపు నెలలు లేదా సంవత్సరాలకు పొడిగిపోయి వడ్డీ భారం పెరగవచ్చని కార్డు ఖాతా వివరాల్లో హెచ్చరిక ఇవ్వాలని నిర్దేశించింది. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం క్రెడిట్ కార్డు ఖాతా చెల్లింపు గడువు తేదీ దాటిన వెంటనే బకాయిగా క్రెడిట్ సమాచార సంస్థలకు నివేదించడం లేదా జరిమానా రుసుములు విధించడం చేయకూడదు. మూడు రోజులకు మించి బకాయి అయినప్పుడు ఈ చర్యలు వర్తిస్తాయి. అయితే ఆలస్యంగా చెల్లించడం సురక్షితం అని దీని అర్థం కాదు. వడ్డీ కార్డు నిబంధనలు, ఇతర ఛార్జీల ప్రభావం ఉండొచ్చు.

### దాగి ఉన్న ఛార్జీలు ఏవి...?

క్రెడిట్ కార్డు తీసుకునే ముందు వినియోగదారుడు ముఖ్యంగా పరిశీలించాల్సినవి చేరిక రుసుము, వార్షిక, పునరుద్దరణ రుసుము, ఆలస్య చెల్లింపు రుసుములు, ఆర్థిక, వడ్డీ రుసుములు, నగదు ఉపసంహరణ రుసుములు. నగదు ముందస్తు తీసుకున్నందుకు వడ్డీ విదేశీ లావాదేవీలకు సంబంధించిన ఛార్జీలు నెలవారి వాయిదాలుగా మార్చేందుకు సంబంధించిన ఛార్జీలు కొన్ని ప్రత్యేక లావాదేవీలపై సేవా రుసుములు వస్తు సేవల పన్ను వంటి వర్తించే పన్నులు ఇవి కార్డు నుంచి కార్డుకు మారవచ్చు. కాబట్టి కేవలం వార్షిక రుసుము లేదా ఉచిత క్రెడిట్ కార్డు అనే ప్రకటన చూసి నిర్ణయం తీసుకోకుండా అత్యంత ముఖ్యమైన నిబంధనలు షరతులు చదవడం అవసరం.

### క్రెడిట్ కార్డు ఎప్పుడు ప్రయోజనకరం...?

నెలవారి ఖర్చులను నియంత్రణలో ఉంచుకుని కార్డు ద్వారా చేసిన ఖర్చును గడువు తేదీలోగా పూర్తిగా చెల్లించగలిగితే క్రెడిట్ కార్డు సౌకర్యవంతమైన చెల్లింపు సాధనంగా ఉపయోగపడుతుంది. అయితే ఆదాయానికి మించి ఖర్చు చేయడం ఒక కార్డు బకాయిని మరో కార్డుతో చెల్లించడం, కేవలం కనీస బకాయి చెల్లించడం వంటి అలవాట్లు అప్పు భారాన్ని పెంచే ప్రమాదం ఉంది.

### సామాన్యుడు గుర్తుంచుకోవాల్సిన సూత్రాలు :

1. కార్డు పరిమితి ఎక్కువగా ఉందని మొత్తం ఖర్చు చేయకండి.
2. సాధ్యమైనంత వరకు ప్రతి నెల మొత్తం చెల్లించాల్సిన బకాయి పూర్తిగా చెల్లించండి.
3. కనీస బకాయి అనేది పూర్తి బిల్లు కాదని గుర్తుంచుకోండి.
4. గడువు తేదీ, వార్షిక వడ్డీ రేటు, ఆలస్య రుసుము, వార్షిక రుసుము వంటి వివరాలను ఖాతా వివరాల్లో పరిశీలించండి.
5. అవసరం లేని కొనుగోళ్ల కోసం క్రెడిట్ కార్డును రుణ సాధనంగా మార్చుకోవద్దు.
6. క్రెడిట్ కార్డు డబ్బు కాదు అప్పుగా లభించే సౌకర్యం. సమయానికి పూర్తి బిల్లు చెల్లిస్తే ఉపయోగకరం. నిర్లక్ష్యం చేస్తే వడ్డీ, ఆలస్య రుసుములు, ఇతర ఛార్జీలతో ఆర్థిక భారం పెరగ వచ్చు. అందుకే కార్డు తీసుకునే ముందు నిబంధనలు చదవడం, ఖర్చును నియంత్రించడం, గడువు తేదీకి ముందే చెల్లించడం ప్రతి వినియోగదారుడి బాధ్యత. క్రెడిట్ కార్డు చేతిలో ఉండటం గొప్ప విషయం కాదు. దాని బకాయిని సమయానికి తీర్చగలగడమే ఆర్థిక క్రమశిక్షణ.

# పద్నాలుగేళ్లయినా..ప్రారంభానికి నోచుకోకపాయే..?

**ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసినా..**
**ఉత్సవ విగ్రహంగానే మిగిలే?**



**ప్రజాపక్షం/చింతకాని :** నియోజకవర్గంలోని మహిళలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం చింతకాని శ్రీచెన్నకేశవ మండల మహిళా సమాఖ్య పట్ల శాపంగా మారుతుంది. మహిళాసమాఖ్య సభ్యుల సమావేశాలు నిర్వహణతో పాటు గ్రామీణ ఉపాధి హామీ పనుల కార్యకలాపాల నిర్వహణ కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 లక్షల వ్యయంతో మండల కేంద్రాల్లో స్త్రీ శక్తి భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా చింతకాని శ్రీచెన్నకేశవ మండల మహిళా సమాఖ్యకు నాటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి 24112011 న రామకృష్ణాపురం పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో ని ఐదు మండలలాకు శంకుస్థాపన చేశారు.నాటి నుండి నేటి వరకు భవన నిర్మాణ పనులు పూర్తికాక చింతకాని మండలపరిషత్ కార్యాలయం ఎదుట నిరుపయోగంగా దర్శనమిస్తుంది. మహిళలు గత ఏడాది మేనెలలో మహిళా సమాఖ్య సభ్యులతో భట్టీ సమావేశం ఏర్పాటు చేయగా మహిళలు తమ భవన నిర్మాణ సమస్యపై వినతి పత్రం అందజేశారు. స్పందించిన భట్టీ వెంటనే కలెక్టర్‌ని భవన నిర్మాణ పనులు పూర్తిచేయించాలని ఆదేశించారు. గతేడాది జూన్ 10వ తేదీన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చింతకాని మండల స్త్రీశక్తి భవన నిర్మాణాన్ని పరిశీలించి పనులు పూర్తిచేసేందుకు అక్కడికక్కడే రూ.5లక్షల చెక్కును స్థానిక ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావుకు అందజేసి నెలరోజుల్లో భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ వచ్చి తమ భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో మహిళలు సంతోషపడ్డారు. నాటి నుంచి పనులు అడపాదడపా చేస్తూ ఈ నెలలో భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే భవనాన్ని మాత్రం ప్రారంభించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తక్షణమే భవననిర్మాణాన్ని ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావాలని మహిళలు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావును ప్రజాపక్షం వివరణ కోరగా స్త్రీశక్తి భవన నిర్మాణపనులు పూర్తయ్యాయి. త్వరలోనే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులమీదుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.

# ప్రముఖ వైద్యులు జగదీష్ బాబు మృతి



(మొదటిపేజీ తరువాయి)



ఎంసిహెచ్ సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యను అభ్యసించాడు. ఖమ్మం మమత మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2010లో బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రస్తుతం ప్రొఫెసర్‌గాను, న్యూరో వైద్య విభాగం హెచ్‌వోడిగాను సేవలు అందిస్తున్నారు. జగదీష్‌కు భార్య కె. సుమ, ఇద్దరు కుమార్తెలు నేహా, దిశ ఉన్నారు. శనివారం రాత్రి ఓ కార్యక్రమంలో ఉత్సాహంగా నృత్యం చేసిన డాక్టర్ జగదీష్‌బాబు మరుసటి రోజే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, వైద్య వర్గాల్లో విషాదం నెలకొంది.

### పలువురి నివాళి :

ప్రముఖ వైద్యులు కె. జగదీష్‌బాబు మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. జగదీష్‌బాబు మృతదేహంతో వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం పెవిలియన్ మైదానం నుంచి మమత ఆసుపత్రి వరకు జగదీష్ భౌతికాయంతో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ నేతలు బాగం హేమంతరావు, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డిలతో పాటు వివిధ పార్టీల నాయకులు, పలువురు వైద్యులు, పుర ప్రముఖులు జగదీష్ మృతిపట్ల సంతాపం, నివాళులర్పించారు. ఓ మంచి వైద్యున్ని కోల్పోయినట్లు పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు మమత వైద్య సంస్థలకు తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు.

# పేదల ఇండ్లను కూల్చడం అన్యాయం



(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు శ్రీనివాస్ నగర్‌లో పేదల ఇండ్లను కూల్చివేసేందుకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. పేదలకు అండగా ఎవరు లేరని వారి ఇండ్లను కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. శ్రీనివాస్ నగర్‌లో పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేసేందుకు కుట్రలు పన్నడం తగదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖాళీ స్థలాల్లో గూడు ఏర్పాటు చేసుకున్న పేదలకు ముఖ్యమంత్రి కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లి సుమారు మూడు వేల మందికి జీవో నెం.58 ద్వారా స్థల క్రమబద్ధీకరణ పట్టాలు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసిఆర్ స్వయంగా వెలుగుమట్ల, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించినప్పుడు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని ప్రతిపాదించిన పేదలు తమ స్థలాలు కావాలని కోరడంతో వారు ఉంటున్న స్థలాలనే క్రమబద్ధీకరించి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ తరుపున పేదలకు అండగా ఉండేందుకు కోర్టులో పోరాడుతున్నామన్నారు. కోర్టు ఆదేశించినట్లుగా వాస్తవ నివేదికను తయారు చేసి నిరుపేదలకు న్యాయం చేయాలని వారు కట్టుకున్న ఇండ్లకు రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. పేదల పక్షాన బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని వారికి అండగా ఉంటుందని ఎవరు అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు, మందడపు రామకృష్ణ, ఖయ్యూం, మెంతుల శ్రీశైలం, రఘు, మస్తాన్, వెంకటేశ్వర్లు, లక్ష్మి నారాయణ, లీగల్ సెల్ బాధ్యులు నీరోషా, తిరుమలరావు, సుగుణారావు పాల్గొన్నారు.

# ఘనంగా దీపోత్సవం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని పదవ డివిజన్ చైతన్యనగర్‌లోని చందమామ అపార్టు మెంట్‌లో గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా దీపోత్సవాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అపార్టుమెంటులో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు, దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంటులోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# గణేష్ మండపాల వద్ద మాజీ మంత్రి పువ్వాడ పూజలు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పలు గణేష్ మండపాలను సందర్శించి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వితరణ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ గణనాధుడు ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధులను ప్రసాదించాలని కోరుకున్నారు. ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, సోదరభావంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, బత్తుల మురళీ, తోట రామారావు, కూరాకుల వలరాజు, దేవభక్తిని కిషోర్‌బాబు, గొల్లపూడి రాంప్రసాద్, మాటేటి కిరణ్, వల్లభనేని రామారావు, వంగాల వెంకట్, బండి నవీన్, మోరంపూడి సాయి, గార్లపాటి సంతోష్, గాదె అనిల్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో ఏసిపి సారంగపాణి ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను వైరా ఏసిపి సాదుల సారంగపాణి ఆదివారం పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిలయన్స్ ట్రెండ్స్ పమీంలో చిన్నారులు ఏర్పాటు చేసిన బాల గణేష్ ఉత్సవ కమిటీ విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏసిపి సారంగపాణి ఉత్సవ కమిటీ నిర్వాహకులు, చిన్నారులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఏసిపి సారంగపాణి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎస్సై పుష్పాల రామారావుతో కలిసి గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏసిపి ప్రారంభించారు. లీలాసుందరయ్యనగర్‌లో గణేస్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఏసిపి సారంగపాణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ చిన్నారులు ప్రత్యేకంగా గణనాధుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని భావితరాలకు సాంస్కృతికి సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా చిన్నారులు విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని ఆయన అన్నారు. గణనాధుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు గణనాధుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని, ఉత్సవాలు అందరికీ ఆనందాన్ని కలిగించేలా నిర్వహించుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, ముదిగొండ మహేష్, కొక్కిరేణి లింగయ్య, బాల ఉత్సవ కమిటీ సభ్యులు పెరుమాళ్ళ కోటేశ్వరరావు, దారా కృష్ణారావు, అశ్విత్ల నిఖిల్, కట్ల సంజు, పార్ధు, హర్ష, సాయి, పునీత్, లీలాసుందరయ్య నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలూరి రాము, ఆవుల రవి, సుధాకర్‌రెడ్డి, కొత్తా రామయ్య కుమారుడు కొత్తా వెంకటేశ్వరరావు, నర్సిరెడ్డి, బాబురావు, సాంబశివరావు, శివ రమేష్, పాశం రవి, పొన్నం ప్రసాద్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ముదిగొండ పీహెచ్‌సీలో ప్రారంభమైన వైద్య సేవలు



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల స్థాయి వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ముదిగొండలో 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రత్యాన్మాయ ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా గతంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టి, ఆసుపత్రికి సంబంధించిన వైద్య పరికరాలు, సామాగ్రిని అక్కడికి తరలించారు. అనంతరం భవనాన్ని వైద్య సేవలకు అనుకూలంగా సిద్ధం చేసి, ఆదివారం నుంచి అక్కడి నుంచే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ప్రాథమిక వైద్యం, వైద్య పరీక్షలు, అవసరమైన మందుల పంపిణీ తదితర సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుత పీహెచ్‌సీ భవనం నుంచి వైద్య సేవలు కొనసాగనున్నాయి. ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నాగేంద్ర ప్రసాద్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు. కొత్తగా నిర్మిస్తున్న 50పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చిన అనంతరం మరింత విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అప్పటి వరకు ప్రస్తుత పీహెచ్‌సీ భవనం నుంచే ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు చేపట్టారు.

# నిరుపేదలకు దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలో స్థానిక ఆజాద్ రోడ్‌లో సంఘ సేవకుడు లంకా కొండయ్య బృందం నిర్వహిస్తున్న మహాత్మాగాంధి ఓల్డ్ క్లాత్ బ్యాంక్, హెల్పింగ్ హోమ్ ద్వారా నిరుపేదలకు వికలాంగులకు ధాతల నుండి దుస్తులు, బెడ్ షీట్లను కొండయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ధాతలు బిక్కి వెంకటరమణరావు, వెలగపూడి సురేంద్ర, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం వారు తమ ఇళ్లలో మిగిలిన దుస్తులు కొండయ్యకు అందజేయగా వాటిని నిరుపేదలకు పంచి పెట్టి మానవత్వం చాటుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన సమితి ఎన్నిక





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఖమ్మంజిల్లా నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా 27వ మహాసభలు శనివారం ఖమ్మంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మడుపల్లి లక్ష్మ ణ్, బూరా మనోజ్ లను ఎన్నుకున్నారు. వీరితో పాటు 16 మంది ఆఫీస్ బేరర్స్‌ను, 51 మందితో నూతన సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని, శాస్త్రీయ విద్యా విధానానికై పోరాడతామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

# పండుగలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయి

## సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి



**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామాల్లో పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు అన్నారు. ఆదివారం మండలపరిధిలోని రాఘవాపురం కాలనీలో గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఒకే చోట గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినంధనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లి సీతయ్య, సింగారపు సత్యనారాయణ, ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్, కొల్లి రవి, వడ్లమాని రాంబాబు, సింగారపు కోటి, మామిళ్లపల్లి రాజేష్, సురేష్, అమరయ్య, మురళి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/చింతకాని :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చింతకాని మండల వ్యాప్తంగా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు మండపాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొదుమూరు ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండలం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల గోవిందరావు, నాయకులు పెంట్యాల అప్పారావు, వేముల సతీష్, వందనం సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు, నిర్వహకులు చల్లగుండ్ల సాయి, కూచిపుడి సందీప్, బోళ్ల బాను, నక్కనబోయిన ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

# గణేశ్ మండపాల వద్ద భద్రతా నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/ముదిగొండ:** గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ముదిగొండ సీఐ ఓ.మురళి సూచించారు. సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ బి.కృష్ణ ప్రసాదరావు మండలంలోని వివిధ గణేశ్ మండపాలను సందర్శించి, పోలీసులు ఏర్పాటు చేసిన పాయింట్ పుస్తకాలను పరిశీలించారు. మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణేశ్ మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో డీజే వినియోగాన్ని నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వేళల్లో కమిటీ సభ్యులు తప్పనిసరిగా మండపాల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. మండపాల వద్ద లేదా నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమానికి చిన్న పిల్లలను తీసుకెళ్లరాదని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ కోరారు.

# ‘భవిష్య’ తో రైతులు సుభిక్షం




**ప్రజాపక్షం/చింతకాని :** రాయల్ సీడ్స్‌కి చెందిన రణధీర్, భవిష్య బీటీ2 పత్తి సాగు చేసిన రైతులందరూ సుభిక్షంగా ఉంటారని రాయల్ సీడ్స్ కంపెనీ డైరక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చింతకాని మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన దొబ్బల నర్సింహారావు సాగు చేసిన రణధీర్, భవిష్య రకం పత్తి వ్యవసాయ క్షేత్రంలో కంపెనీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్య రకం తెగుళ్లకు తట్టుకుంటూ అధిక దిగుబడి వస్తుందన్నారు. 500 మంది రైతులు ఈప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి అనుణగుణంగా చీడపీడలకు , తెగుళ్లకు తట్టుకుంటూ చెట్టుకు 70 నుంచి 80 కాయలుతో 16 క్వింటాళ్ల పైగా దిగుబడి వస్తుందని రైతు దొబ్బల నర్సింహారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ రీజనల్ మేనేజర్ దొబ్బల వెంగళరావు, తెలంగాణ డ్రిస్టిబ్యూటర్ నాగరాజు, వరంగల్ మేనేజర్ మల్లారెడ్డి, ఖమ్మం మేనేజర్ నాగేశ్వరరావు ఆంజనేయులు, చింతకాని సహకార సంఘం డైరక్టర్ కొల్లి గోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

# పిల్లల మేథస్సుపై ఏఐ ప్రభావం



**- అవకాశాలతోపాటు ఆలోచనా శక్తికి సవాల్**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నేటి సాంకేతిక యుగంలో కృత్రిమ మేథస్సు (ఏఐ) పిల్లల చదువుల్లోనూ కీలకంగా మారుతోంది. పాఠ్యాంశాలు సులభంగా అర్థం చేసుకోవడం, సందేహాలకు సమాధానాలు పొందడం, కొత్త విషయాలను తెలుసుకోవడం, ప్రాజెక్టులు రూపొందించడం వంటి వాటిలో ఏఐ ఉపయోగపడుతోంది. సరైన విధంగా వినియోగిస్తే పిల్లల్లో కొత్త విషయాలను అన్వేషించే ఆసక్తి సృజనాత్మకత సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందే అవకాశముంది. అయితే ఏఐపై అతిగా ఆధారపడం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. హోమ్‌వర్క్ వ్యాసాలు ప్రశ్నలకు సమాధానాలు వంటి వాటిని పిల్లలు స్వయంగా ఆలోచించకుండా ఏఐపైనే ఆధారపడితే వారి స్వతంత్ర ఆలోచనా శక్తి పరిశీలిన రచనా నైపుణ్యాలు తగ్గే అవకాశం ఉంది. ముఖ్యమంగా ఏఐ ఇచ్చే ప్రతీ సమాచారాన్ని నిజమని నమ్మకుండా పరిశీలించుకునే అలవాటు చేసుకోవాలి . పిల్లల అభ్యాసంలో ఏఐని పూర్తిగా దూరం చేయడం కంటే దానిని సహాయక సాధనంగా ఉపయోగించడం మంచిదని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. పుస్తకపఠనం, ఉపాధ్యాయులతో చర్చ ప్రయోగాత్మక విద్య ఆటలు సృజనాత్మక కార్యక్రమాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లల ఏఐ వినియోగాన్ని పరిశీలిస్తూ గోప్యత అన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించాలి. ఏఐ పిల్లల మేధస్సును తప్పనిసరిగా పెంచుతుంది, లేదా తగ్గిస్తుందని అని చెప్పడం కంటే దానిని పిల్లలు ఎలా వినియోగిస్తారు అనేదే అత్యంత కీలకం. స్వయంగా ఆలోచించిన తర్వాత ఏఐ సహాయం తీసుకునే విధానాన్ని అలవాటు చేస్తే సాంకేతికతను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు పిల్లల మేధో వికాసాన్ని కూడా కాపాడుకోవచ్చు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు నేడు ఐటిడిఏ ముందు ధర్నా



ప్రజాపక్షం/భద్రాచలం : ఆదివాసీ హక్కుల పరిరక్షణకై నేడు భద్రాచలంలో భారీ ప్రదర్శన ఐటిడిఏ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసీ నాయకులు తెలిపారు.ఈ మేరకు ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కులు భూమి అటవీ హక్కుల పరిరక్షణతో పాటు 1/70,పెసా, అటవీహక్కుల చట్టం పాలకులు సమర్థవంతంగా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా భద్రాచలం ఆదివాసీ మార్క్ బ్రిడ్జి సెంటర్ నుండి ఐటిడిఏ వరకు నిర్వహిస్తామని ఐటిడిఏ ఎదుట భారీ ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఐటిడిఏలను పరిష్టం చేయడంతో పాటు ఐటిడిఏ పరిధిలోని ఉద్యోగాలను ఆసంస్థ ద్వారానే భర్తీ చేయాలని ఆదివాసీ ప్రాంతాల్లో విద్యవైద్యం రహదారులు మౌళిక వసతులను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు ఆదివాసీ ప్రజలు, మహిళలు యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోండ్రు సుధారాణి, కుంజా సంతోష్ కొర్సా చిట్టిబాబుదొర వీసాల కృష్ణయ్య కణితి రాధ వీసాల ఉమాదేవి మిడియం నాగమణి శీలం దుర్గ ఓ కెచ్చల భవాని శీలం రాజారావు సోయం మంగవేణి ఉయిక వంకట లక్ష్మీ నవలం రాధ అట్టం కమల పాల్గొన్నారు.

## పలు వినాయక మండపాల్లో మాజీ ఎంఎల్ఏ హరిప్రియ పూజలు





ప్రజాపక్షం/ఇల్లందు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 13.14,18,21 వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, 14వ వార్డు నాయకులు ఓశల్, గిన్నారపు రాజేష్, 18వ వార్డు కౌన్సిలర్ పాబోలు స్వాతి కిరణ్, 21వ వార్డు ధనాల వాసు ఆహ్వానం మేరకు ఆయా మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీలు, స్థానికులు హరిప్రియ నాయక్‌ను శాలువాతో సత్కరించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జాగ్రత్తతో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సిలివేరి సత్యనారాయణ, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎండి అబ్దుల్ జబ్బార్, పీఏసీఎస్ ఛైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, సీనియర్ నాయకులు భూక్య దలేసింగ్, అబ్దుల్ నబీ, యువజన నాయకులు సత్తాల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, ఎస్‌కె చాంద్ పాషా, నెమలి నిఖిల్, కొంటూ రవికాంత్, నీలం రాజశేఖర్, రామ్‌లాల్ పాసి, తదితరులు పాల్గొన్నారు.

## నాగేశ్వరరావుకు పాయం నివాళి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు గ్రామానికి చెందిన సాధనాల నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆదివారం బూర్గంపాడు యాదవ్ బజార్‌లోని భారతీ భవన్‌లో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, నాగేశ్వరరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సింగరేణికి సీతారామ జలాలు అందించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలోని సాగుభూములకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరందేలా కాలువ నిర్మించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ డిమాండ చేశారు. ఆదివారం రేలకాయలపల్లి రెవెన్యూ పరిధిలో జరుగుతున్న సీతారామ కాలువ నిర్మాణ పనులను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. కారేపల్లి, కామేపల్లి మండలాల్లో రైతులు దశాబ్దాలుగా సాగునీటి సౌకర్యం లేక వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారని వారు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు రూపకల్పనలో కారేపల్లి మండల సాగుభూములకు నీరందేలా కాలువలను నిర్మించాలని కోరారు. ప్రస్తుత నిర్మాణ విధానంతో సింగరేణి మండలానికి సాగునీరు అందే అవకాశం లేకుండా పోతుందని పేర్కొన్నారు. జిల్లా మంత్రులు చొరవ తీసుకుని సింగరేణి మండలానికి గోదావరి జలాలు అందించాలని, లేనిపక్షంలో రైతులను ఐక్యం చేసి సాగునీటి కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిఐటియూ జిల్లా నాయకుడు కుందనపల్లి నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, మాజీ సర్పంచులు భూక్యా రమణ, బానోతు సక్రామ్, రైతు నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

**- 10 లక్షల ఆస్థి నష్టం**



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రమాదవశాత్తు శనివారం రాత్రి కరకవాగులో ఓఇల్లు దగ్ధమైన ఘటనలో సుమారు పది లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు తెలిపిన ప్రకారం పట్టణ పరిధి కరకవాగుకు చెందిన ముబీన్ ఇంటిలో నుండి శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు బయటకు వచ్చి చూడగా ఇంట్లో నుండి నుండి మంటలు ఎగిసిపడుతున్నాయి. వెంటనే ఇంటి యాజమానికి ఫోన్ చేసి ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. కొత్తగూడెం నుండి ఫైర్ ఇంజన్ వచ్చే లోపే ఇంట్లోని విలువైన వస్తువులు, పిల్లల సర్టిఫికెట్లు కాలి బూడిదైనాయి. సుమారు 10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ఇంట్లో ఎవరు లేకపోవటంతో ప్రాణ నష్టం తప్పిందని బాధితులు తెలిపారు. ఆదివారం విఆర్ఓ పంచనామా చేశారు. మంటలకు కారణాలు తెలియాలి.

## ఉత్సాహభరితంగా టెన్నిస్ టోర్నమెంట్



ప్రజాపక్షం/పాల్వంచ : శ్యామలాగోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ టోర్నమెంట్ 2026 క్రీడలు ఆదివారం మూడవ రోజుకు చేరుకొన్నాయి. కొత్తగూడెం ప్రగతి మైదానం, పాల్వంచ నవభారత్. విద్యుత్ కళాభారతి, శ్రీనివాస కాలనీలోని మినీ స్టేడియంలో జరిన క్వాటర్ ఫైనల్ పోటీలలో మొత్తం 80 జట్లు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రల నుండి పాల్గొన్న క్రీడాకారులు ఎండను లెక్క చేయకుండా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

## పుట్టిన రోజున నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రజాపక్షం/పాల్వంచ : సిపిఐ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు కూతురు స్నేహలత పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం దంతెలబోర ఎస్‌సి కాలనీకి చెందిన నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణి చేసి పాఠశాలలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేకులు కట్ చేయటం లాంటి వాటికి దూరంగా ఉండాలని చిన్నతనం నుండి ఇతరులకు తోడ్పాటునందించాలనే ఆశయంతో పేదలకు సరుకులు పంపిణి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నీలం భాస్కర్, పి. హనుమంతరావు, పూర్ణచందర్‌రావు, బి. నాగేశ్వరరావు, కే. బాపూజి, వెంకటస్వామి, ఆదిలక్ష్మి, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాధనాల నాగేశ్వరరావుకు నివాళి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల కేంద్రానికి చెందిన సాధనాల నాగేశ్వరరావు దశదిన కర్మ కార్యక్రమానికి బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, నాయకులు సిరిపురపు ప్రసాద్, గంగరాజు యాదవ్, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు వార్డుల్లో అన్నదానం



ప్రజాపక్షం/ఇల్లందు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇల్లందు పట్టణంలోని 12,13,14,17,19,22 వార్డులతో పాటు సబ్జల్ బస్తీ, డోన్ నంబర్ బస్తీల్లో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. 13వ వార్డులో కౌన్సిలర్ దండు సారయ్య ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భానోత్ హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ ఫౌండర్ మెంబర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దిండిగల రాజేందర్ మాట్లాడుతూ అన్నదానం ద్వారా పేదల ఆకలి తీర్చడం గొప్ప కార్యక్రమమని, గణేష్ ఉత్సవ కమిటీలు ఏటా అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. 12వ వార్డులో శివలాల్ పాసి ఆధ్వర్యంలో, 14వ వార్డులోనూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

ప్రజాపక్షం/కారేపల్లి: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు తీవ్రత పెరుగుతోందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్కా, జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ అన్నారు. కారేపల్లి మండలం ఉమ్మడి గుంపెల్లగూడెం పంచాయితీ పరిధిలోని పాత చెన్నెగలగడ్డలో రైతులతో వారు మాట్లాడారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని తెలిపారు. పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించి రైతు, కూలీలకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వంగూరి వెంకన్న, సాంబ, చుంచు నాగమణి, కౌసల్య, వెంకటరమణ, నాగేశ్వరరావు, ఆర్ఎం కాంతమ్మ, పుల్లయ్య, శ్రీరాములు, కోటేష్, రవి, శాంతక్క పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశం వాయిదాలకు అసలు కారణం ఏమిటి?

**-వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంపై వీడని సందేహాలు**
**-కమీషనర్ హైదరాబాద్ వెళుతున్నారంటూ అధికారిక ప్రకటన**
**-అదే రోజు వైరాలోనే పలు కార్యక్రమాల్లో పాల్గొనడం చర్చనీయాంశం**
**-సమావేశం వాయిదాపై అధికార , ప్రతిపక్ష కౌన్సిలర్ల అసంతృప్తి**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా పడటానికి అసలు కారణం ఏమిటనే ప్రశ్న ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మరింది. ఈ నెల19న జరగాల్సిన కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమీషనర్ ఎం.రామచంద్రరావు హైదరాబాద్ వెళ్లాల్సి ఉండటంతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు ప్రెస్ నోట్ ద్వారా వెల్లడించారు. అయితే అదే రోజు కమీషనర్ వైరా మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడం కౌన్సిలర్లలో కొత్త ప్రశ్నలకు తావిస్తుంది.

## హైదరాబాద్ పర్యటన...వైరాలో కార్యక్రమాలు?

కౌన్సిల్ సమావేశం వాయిదాకు కమీషనర్ హైదరాబాద్ వెళ్లాల్సి ఉందని అధికారులు పేర్కొన్నప్పటికీ, 19వ తేదీన కమీషనర్ వైరాలోనే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు కౌన్సిలర్ల పేర్కొంటున్నారు. దీంతో సమావేశం వాయిదాకు అధికారికంగా చెబుతున్న కారణం, క్షేత్రస్థాయిలో కనిపించిన పరిస్థితులకు మధ్య వ్యత్యాసం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని పలువురు కౌన్సిలర్లు కోరుతున్నట్లు సమాచారం.

## అధికార పక్షంలోనే అసంతృప్తి?

సమావేశం వాయిదా వ్యవహారంపై ప్రతిపక్ష బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లతో పాటు అధికార కాంగ్రేస్ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. అధికార పక్ష కౌన్సిలర్ల మధ్య ఉన్న అభిప్రాయ బేధాలు, సమావేశానికి కొందరు హాజరుకాకపోవచ్చేనే పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే సమావేశాన్ని వాయిదా వేసినట్లు కొందరు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై మున్సిపల్ అధికారులు లేదా పాలకవర్గం నుంచి స్పష్టమైన వివరణ వెలువడాల్సి ఉంది.

## ఎజెండాపైనా గతంలో అభ్యంతరాలు

కౌన్సిల్ సమావేశాల ఎజెండా రూపకల్పన విషయంలో కూడా గత కొన్ని సమావేశబూాల నుంచి కౌన్సిలర్లలో అసంతృప్తి కొనసాగుతున్నట్లు సమాచారం. కౌన్సిలర్ల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తీసుకోకుండా ఎజెండా రూపొందిస్తున్నారని, గత సమావేశాల్లో వ్యతిరేకించిన అంశాలను కూడా తీర్మానాల రూపంలో ప్రవేశపెట్టారని కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. దీంతో కౌన్సిల్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు, తీర్మానాలపై అభ్యంతరాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయని కౌన్సిలర్లు గుర్తుచేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికపై రాజకీయ ప్రభావమా?

మున్సిపల్ కౌన్సిల్ ప్రజా సమస్యలను చర్చించి వాటికి పరిష్కార మార్గాలను నిర్ణయించాల్సిన వేదిక. అలాంటి సమావేశాలు తరచూ వాయిదా పడటం వలన పట్టణంలోని పారిశుద్ధ్యం, డ్రైనేజీ , రహదారులు, పన్నులు, అభివృద్ధి పనులు తదితర అంశాలపై నిర్ణయాలు ఆలస్యమయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య ఉన్న రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయ బేదాలు పాలనపై ప్రభావం చూపకూడదని ప్రజలు కోరుతున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన యోచన?

కమీషనర్ వ్యవహారశైలిపై కొందరు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. కౌన్సిలర్లందరిని సమానంగా పరిగణిస్తూ, ప్రజా సమస్యలపై చర్చించేందుకు కౌన్సిల్ సమావేశాలు సజావుగా జరిగేలా చూడాలని వారు కోరుతున్నట్లు తెలుస్తుంది.

## అసలు కారణం తేల్చాల్సింది ఎవరు?

సమావేశం వాయిదాకు హైదరాబాద్ పర్యటన కారణమని అధికారులు చెబుతున్న నేపధ్యంలో అదే రోజు కమీషనర్ వైరాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నరనే కౌన్సిలర్ల వాదనకు స్పష్టత రావాల్సి ఉంది. సమావేశం వాయిదా నిర్ణయం పరిపాలనా కారణంతో జరిగిందా? లేక పాలకవర్గంలోని అంతర్గత విభేదాల చర్చగా మారింది. కౌన్సిల్ సమావేశం వాయిదాపై మున్సిపల్ అధికారులు పూర్తి వివరాలతో వివరణ ఇస్తేనే ఈ వ్యవహారంపై నెలకొన్న సందేహాలకు తెరపడే అవకాశం ఉంది. ఏదేమైనా అధికార కాంగ్రేస్ కౌన్సిలర్ల మధ్య నెలకొన్న విభేదాలు, ప్రతిపక్ష కౌన్సిలర్ల అభ్యంతరాలు, కమీషనర్ వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు కలిసి వైరా మున్సిపాలిటీలో పాలనా వ్యవహారాలను మరోసారి చర్చనీయాంశంగా మార్చాయి.

# భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అన్నదానం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలంలోని కొరట్లగూడెం గ్రామంలో ఆదివారం యువజన కాంగ్రెస్ నాయకులు మార్తికోటి శ్రీ లక్ష్మీ దంపతులు మండపంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అదే విధంగా భైరవునిపల్లి గ్రామంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# ఘనంగా శ్రీ విజయ విఘ్నేశ్వర మహోత్సవాలు

**-27వ మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, మహా అన్నదానం**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని వ్యాపారస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి 27వ మహా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కందుల కృష్ణార్జునరావు, దుర్గా భవాని, గోపాలకృష్ణ, ఉమాదేవి, రామకృష్ణ, ప్రతిభ దంపతులు పూజల్లో పాల్గొని ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం వర్తక సంఘం అధ్యక్షుడు దోసపాటి పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. అన్నదానికి సహకరించిన దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం డప్పులు, కొమ్ము నృత్యాలతో గణేష్ శోభాయాత్ర, అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో బచ్చు స్వరాజ్యరావు, లాల్‌సింగ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడు ఆశీస్సులు అందరకి కలగాలి

**మార్కెట్ కమిటి చైర్మన్ సీతారాములు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వినాయకుడు ఆశీస్సులు అందరకి కలగాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు కోరారు. మండలం లోని చెన్నారం లో ఆదివారం వినాయక ఉత్సవాలలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందించేలా నడుచుకోవాలన్నారు. మతసామరాస్యత కు ప్రతీకగా పండుగలు ఉండాలని సూచించారు. సకాలంలో వర్షాలు పడి, పంటలు సమృద్ధిగా, పండాలని ఆకాంక్షించారు. పూజలు ఫలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మస్తాన్, మంకెన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తాటిపూడి వినాయకుడికి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైరా ఏసిపి సాదవుల సారంగపాణి, ఎస్సై పుష్పాల రామారావు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఏసిపి సారంగపాణి, ఎస్సై పుష్పాల రామారావుకు సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజుద ంపతులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంఆ ఏసిపి సారంగపాణి, ఎస్సై పుష్పాల రామారావులను సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులతో పాటు గ్రామ ప్రజలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తాతా నిర్మల, వెంకటేశ్వర్లు దంపతుల, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, పలువురు, యువకులు పాల్గొన్నారు.

# నవ దంపతులకు మాజీ ఎంఎల్‌ఏ దంపతుల ఆశీస్సులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన రామ్‌సాయి సుమంత్‌రెడ్డి, హేమలత నవ దంపతులను పినపాక నియోజకవర్గం మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావు, సుధారాణి దంపతులు ఆత్మీయంగా ఆశీర్వదించారు. నవ దంపతులకు అక్షింతలు వేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ నాగలక్ష్మీ దంపతుల కుమారుడు రామ్‌సాయి సుమంత్‌రెడ్డి వివాహం హేమలతతో ఇటీవల జరిగింది.

**ఆత్మీయంగా పలకరించిన నాయకులు...**

ఈ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, స్థానిక సర్పంచ్ బానోత్ సరోజతో పాటు బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు హాజరై వన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పర్ణశాలలో గణేష్ నిమజ్జనానికి అనుమతి ఉన్నట్టా.. లేనట్టా..?

**-అయోమయంలో భక్తజనం, స్పష్టత కోసం ఎదురుచూపు**




**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** పర్ణశాల గోదావరి తీరంలో గణేష్ నిమజ్జనానికి అనుమతులు ఉన్నాయా? లేదా అన్న? దానిపై భక్తుల్లో అయోమయం నెలకొంది. నిమజ్జనానికి అనువైన ప్రాంతాలపై అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించినప్పటికీ తుది నిర్ణయం ప్రకటించకపోవడంతో భక్తులు, ఉత్సవ కమిటీలు స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. ర్యాంప్, నిమజ్జన ప్రాంతం, గోదావరి లోతు, విద్యుత్, పారిశుధ్యం, పార్కింగ్, రూట్‌మ్యాప్ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. పూర్తి నివేదిక ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు అప్పట్లో వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమంపై స్పష్టమైన అధికారిక ప్రకటన చేసి భక్తుల సందేహాలను నివృత్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# తుర్రంవారిగూడెంలో వృద్ధురాలి అనుమానాస్పద మృతి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని తుర్రంవారిగూడెం గ్రామానికి చెందిన జర్పుల సువాలి(60)అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను గొంతు నులిమి హత్య చేసి, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను అపహరించినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలు, నిందితుల వివరాలు తెలియాల్సి ఉండగా, ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చంద్రుగొండలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామ పంచాయితీ పరిధిలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పాలకవర్గం చర్యలు చేపట్టింది. అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ సహకారంతో ఆదివారం గ్రామంలోని పలు వీధుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ పనులను పర్యవేక్షిస్తూ స్తంభాల ఏర్పాటు చేయించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి అంకిరెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్, జిల్లా నాయకుడు సారేపల్లి శేఖర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కేశబోయిన నరసింహారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి మహేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చాపలమడుగు రాములు, సేవాదళ్ మండల అధ్యక్షుడు బుంగ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పంతులు, హసీనా, మండల నాయకులు చాపలమడుగు లక్ష్మణరావు, కళ్యాణి శంకర్, చాపలమడుగు మనోహర్, కడియాల పుల్లయ్య, హరికృష్ణతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# యువత చెడు మార్గంలో పయనించవద్దు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యువత చెడు మార్గంలో పయనించ కుండా భక్తి శ్రద్ధలతో పది మందికి ఉపయోగపడేవిధంగా ఉండాలని

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని లక్ష్మి నర్సింహా స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దండి సురేష్ పాల్గొని ప్రారంభించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కుల మతాలను గౌరవిస్తూ అన్ని మతాలను సమానంగా చూడటమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు శ్రీనివాస్, శివకృష్ణ, కూరపాటి ప్రదీప్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, సతీష్‌రెడ్డి, యాకయ్య, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు దుర్గానాథ్, రవివర్మ పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, తీగలు తొలగించాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే తొలగించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని నర్సింహా స్వామి గుడి, కనకదుర్గమ్మ గుడి వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, స్తంభాలు ఉన్నాయన్నారు. చిన్న గాలి వాన వచ్చిన తీగలు తగులుకుని నిప్పు రవ్వలు వస్తున్నాయని ఇవి వాహనదారుల మీద పడటం జరుగుతుందన్నారు. ఆ ప్రాంతంలో ప్రయాణించే



ప్రజలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల క్రింద పిల్లర్లు కుంగిపోతున్నాయని, తీగలు వ్రేలాడుతున్నాయని సమీపంలో స్కూల్ పిల్లలు ఆడుకుంటున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు దుర్గానాథ్, నాయకులు ఎండి మజీద్, అక్బర్, పీర్‌సాహెబ్, స్థానికులు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో సత్య యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్‌ఐ జగదీశ్ ప్రారంభించారు. గణేశ్ ఉత్సవాల సందర్భంగా భక్తులు, గ్రామస్తుల కోసం సుమారు 500మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ జగదీశ్ మాట్లాడుతూ..గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతోపాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొవ్వూరి పద్మ, సత్తిరెడ్డి, కొవ్వూరి సందీప్ రెడ్డి, మావిడాల శ్రవణ్, కొండం పరమేశ్,



వినోద్, నవీన్, సతీశ్, అశోక్, స్వరాజ్, శ్యామ్, వార్డు సభ్యులు మోటా పోతుల పద్మప్రియ, మాగి వెంకన్న, పల్లి గోపి, మోటపోతుల సరిత, తండ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో కాపా చంద్రకళ ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పరిధిలో పలు వినాయక మండపాల్లో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా హాజరైన ఆమె గణనాధుడికి ప్రత్యేక పూజలు చేసి, భక్తులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు మండపాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్న మండపాల కమిటీ సభ్యులకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాధుడి ఆశీస్సులు



పొందాలని ఆకాంక్షించారు.

# కులమతాలకు అతీతంగా గణేష్ లడ్డూ పాట



ప్రజాపక్షం/వైరా: నవరాత్రుల సందర్భంగా ఖానాపురం గ్రామంలో గణేష్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదం వేలంపాటలో కుల

**ఖానాపురంలో ఐక్యతకు ప్రతీకగా పాల్గొన్న షేక్ హుస్సేన్**

తాలకు అతీతంగా గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ లాల్‌మహ్మద్ మేనల్లుడు షేక్ హుస్సేన్ సాహెబ్ లడ్డూ ప్రసాదాన్ని పాటలో పొందారు. లడ్డూ ప్రసాదాన్ని పొందడం ఎంతో సంతోషంగా ఉందని షేక్ హుస్సేన్ తెలిపారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ప్రజలు పండుగలను కలిసి జరుపుకోవడం ద్వారా పరస్పర సోదరభావం, ఐక్యత మరింత బలపడతాయని అన్నారు. ప్రజలంతా కలిసి మెలిసి ఉండే వాతావరణానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి ఆదిత్య, మైసూర్, కమిటీ సభ్యులు మాలోతు గోపి, సునావత్ హరి, బోడా సంజయ్, వెంకటేశ్వర్లు, కృష్ణ, మీరా సాహెబ్, గోపి తదితరులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డిసిసిబి మాజీ డైరెక్టర్ రామారావు మృతి



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కిలారు రామారావు (67) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం ఉదయం అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు రామారావును ఖమ్మంలోని స్తంభాద్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య భార్గవి ఉపాధ్యాయురాలిగా పదవి విరమణ పొందారు. కుమారుడు, కుమార్తె విదేశాలలో నివసిస్తున్నారు. వి. వెంకటాయపాలెం యూత్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన కిలారు రామారావు గ్రామంలో యువతకు ఆదర్శంగా నిలిచారు. తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. వి. వెంకటాయపాలెం ఉప సర్పంచ్‌గా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన మృతితో కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# అన్నదానాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి పువ్వాడ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ గోపాలపురం ఎల్‌బి నగర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ నాయకులు భూక్యా అశోక్ ఏర్పాటు



చేసిన అన్నదాన కార్యక్రమంలో పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రారంభించారు. గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గొల్లపూడి రాంప్రసాద్, ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, గాదె అనిల్, మాటేటి కిరణ్, మోహన్, నర్సింహా, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# రొంపిమళ్ల రుక్మిణికి సన్మానం

ప్రజాపక్షం/మధిర: రొంపిమళ్ల గ్రామానికి చెందిన ఏక్తా రుక్మిణికి ఉస్మానియాలో ఎంబిబిఎస్ సీటు వచ్చినందుకు గాను రొంపిమళ్లలో పుట్టి పెరిగిన ప్రస్తుతం వ్యాపార నిమిత్తం ఖమ్మంలో ఉంటున్న సత్యసాయి ఫార్మర్ సెంటర్, కుమార్ మోటార్ అధినేత గొండెల సత్యనారాయణ, వారి అల్లుళ్ళు కుంకిమళ్ళ మిత్ర సాయిరాం భీమవరపు సాయి సంతోష్‌లు ఏక్తా రుక్మిణి శాలువాతో సత్కరించి స్టెతస్కోపును బహూకరించారు. వారు మాట్లాడుతూ ఏక్తా రుక్మిణి చిన్న



తాత డాక్టర్ గొల్లమందల కొండలరావు కార్డియాలజిస్టును ఆదర్శంగా తీసుకొని ఎంతో కష్టపడి చదివి ఎంబిబిఎస్‌లో సీటు సాధించినందుకు మారుమూల గ్రామంలో పుట్టి ఎంబిబిఎస్‌లో సీటు వచ్చినందుకు కన్న తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చినందుకు ఎంతో గర్వకారణం అని డాక్టర్‌గా ఎదిగి ఊరికి ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు.

# ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా వేము సందేశ్

ప్రజాపక్షం/కల్లూరు: అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన వేము సందేశ్ ఎన్నికయ్యారు. ఈనెల 19వ తేదీన ఖమ్మం పట్టణంలో జరిగిన 27వ జిల్లా మహాసభల్లో ఎన్నికైనట్లు ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. సందేశ్ ఎన్నిక పట్ల పార్టీ ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సందేశ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహిస్తానని ఈ అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలియపరిచారు.



# క్రీడా మైదానంలో గ్లోబల్ రెయిన్‌బో జైత్రయాత్ర



ప్రజాపక్షం/కూసుమంచి: క్రీడా మైదానంలో గ్లోబల్ రెయిన్ బో జైత్రయాత్ర కొనసాగించింది. చదువుల్లోనే కాదు ఆటల్లో కూడా ముందుంటాం అని సత్తా చాటింది. మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ విభాగంలో బహుమతులు గెలుచుకొని విజయదుందుభి మోగించింది. కూసుమంచి ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. కబడ్డీ సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించి తమ ప్రతిభను చాటారు. అలాగే జూనియర్ వాలీబాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. సీనియర్ బాలికల వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, సీనియర్ బాలుర వాలీబాల్ విభాగంలోనూ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులకు ఎంఈఓ రాయల వీరస్వామి ప్రశంసా పత్రం, మెడల్స్, షీల్డులు అందజేసి అభినందించారు. శనివారం క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్, జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్, పాఠశాల ఇన్‌చార్జులు జహ్నవి, పాపారావు, నాజియా, పీఈటీ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతోనే ఆదర్శ సమాజ నిర్మాణం



- ఆధ్యాత్మిక సేవాభావం అభినందనీయం
- బేధాభిప్రాయాలు వీడి కలిసికట్టుగా ఉత్సవాలు జరుపుకుందాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆధ్యాత్మిక భావనతో పాటు సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే పండుగల పరమార్థం నెరవేరుతుందని సిపిఐ జిల్లాకార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా అభిప్రాయపడ్డారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ ఎన్ఎం సిసి ఆధ్వర్యంలో, 30ల డివిజన్ గొల్లగూడెం, 29వ డివిజన్ ప్రగతినగర్, 26వ డివిజన్ మధురబస్తీలలో ఆదివారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాలను మేయర్ మూడ్ గణేష్‌తో కలిపి ప్రారంభించారు. అంతకుముందు ఆయా ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక మండపాల వద్ద కొలువుదీరిన గణపతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పాషా మాట్లాడుతూ సమిష్టి తత్వానికి మత సామరస్యానికి పతీకగా నిలిచే వినాయక చవితి వేడుకల్లో అన్నదానం వంటి మహత్తర సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందీయం అన్నారు. ప్రజలంతా వర్గ వర్ణబేధాలు లేకుండా ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి పేదలకు బాసటగా నిలిచి సేవా గుణాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు దాసరి శ్రీనివాస్, దర్గయ్యతో పాటు నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, సమైఖ్య, పి సత్యనారాయణ చారి, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, యెర్రరాజు, కసరబోయిన రమేష్, ఏ లక్ష్మీ నారాయణ, పసుపులేటి భరత్, పొన్నం అజయ్, సాంబ, చోటు షరీఫ్, అంజాన్ రావు, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులకు అందజేశారు. మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం రూ.6 లక్షల 80 వేల రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మణుగూరు మండలానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, ముఖ్య నాయకులు పాతూరి వెంకన్న, అబ్దుల్లా, అప్పారావు, తిరుమలేష్, చింతల కృష్ణ, మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కారు డోర్లు లాకై ఊపిరాడక చిన్నారి మృతి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ నాలుగేళ్ళ చిన్నారి అంతలోనే తనువు చాలించింది. ఇంటి ముందు పార్క్ చేసున్న కారులో ఆడుకునేందుకు ఎక్కి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జూలూరుపాడు మండలపరిధిలోని వినోబానగర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ పెద్ద కుమార్తె తన్విత శ్రీ (4) కారులోకి వెళ్లి ప్రమాదవశాత్తు లోపల ఇరుక్కుపోవడంతో ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో సర్పంచ్ కుటుంబంతో పాటు గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. ఆడుకుంటూ కారులోకి వెళ్లిన చిన్నారి అనుకోకుండా లోపలే చిక్కుకుపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతసేపటి తర్వాత చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా కారులో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఐదేళ్ల చిన్నారి అకాల మరణంతో సర్పంచ్ గంగావత్ నవీన్, కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్నారి మృతివార్త తెలుసుకున్న మండల ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో వినోబానగర్ గ్రామానికి చేరుకొని నవీన్ కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిన్నారి మృతితో వినోబానగర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పిఆర్‌జిటిఏ జిల్లా కమిటి ఎన్నిక




**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లాలోని మైనారిటీ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, జనరల్ గురుకుల సొసైటీలకు చెందిన ఉపాద్యాయుల సమావేశం ఆదిఆరం జరిగింది. ఈ సంధర్భంగా ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటి ఎన్నుకొన్నారు. 24 మందితో ఏర్పాటైన కమిటీలో జిల్లా కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొప్పుల హరిప్రసాద్, నల్లమల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ ప్రసిడెంట్‌గా దాసరి సరిత, గౌరవ అద్యక్షులుగా గంగావతి వెంకటేష్, అదనపు ప్రధాన కార్యదర్శిగా కే. మేరీలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో పిఆర్‌జిటిఏ రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గుర్రం రమేష్ గౌడ్, నిర్మలానందం, ఉప్పు అసోక్, రామక్రిష్టారెడ్డి, కమటం నాగేశ్వరరావు, పానుగంటి విజయ్, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, పగడాల నరసింహ, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మంగాపురంకు మరో మూడు రోజులు ఇవ్వాల్సిందే

## రైతుల కోరిక మేరకు సీఈ ఆదేశాలతో కాలువ సందర్శన



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మంగాపురం19 మేజర్ కు మరో మూడు రోజులు నిరంతరం నీటిని సరఫరా చేయాలని మేజర్ చివర ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. మంగాపురం మేజర్ కాలువ కు నీటి సరఫరా తగ్గటంతో చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి ఆదివారం నీటి పారుదల శాఖ సీఈ వాసంతి కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఈ మధిర సబ్ డివిజన్ నీటిపారుదల శాఖ ఈఈ మధు ను క్షేత్ర స్థాయికెళ్లి కాలువ నీటి ప్రవాహం ను పరిశీలించాలని ఆదేశించారు. ఈ మేరకు కాలువ ను సందర్శించారు. రైతుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగాపురం మేజర్ కాలువ కు నిరంతరం మరో మూడు రోజులు, నీటిని సరఫరా చేస్తే కొంత మేరకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు కాలువ ను బంద్ చేయకుండా 500 క్యూసెకుల నీటిని విడుదల చేయాలని కోరారు. అదే విధంగా కాలువ పై బ్రిడ్జి శిధిలావస్థలో ఉందని, శాశ్వత వంతెన ను నిర్మించాలని రాధాకృష్ణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో మధిర సబ్ డివిజన్ డీఈఈ రాంబాబు, ఏఈ లు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటం

## - డిసెంబర్ 26,27,28 తేదీల్లో టిఎస్‌యూటిఎఫ్ 7వ రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** ప్రభుత్వవిద్యారంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐఖ్యఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యూటిఎఫ్) ఆధ్వర్యంలో కొత్తగూడెంకేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్ర 7వ మహాసభలను జయప్రధం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆహ్వానం సంఘం ఏర్పాటులో భాగంగా ఆదివారం మండలపరిధిలోని విద్యానగర్ శ్రీరామ ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు మురళీ మోహన్ అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వవిద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమహక్కులు సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రోత్సహించడం సర్కారు విద్యావిధానం గాడితప్పుతోందన్నారు. పోరాటల గడ్డ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా డిసెంబర్ 26,27,28 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆహ్వాన కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా కొత్తగూడెం ఎంఎల్ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులుగా కోనేరు పూర్ణచంద్రరావు కార్యనిర్వాహక అధ్యక్షునిగా బి.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లుతో పాటు తదితరులున్నారు.

# రోడ్డుపై గోతులు..పూడ్చిన సిపిఎం నాయకులు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మల్లెలమడుగు పంచాయితీ పరిధిలోని మొండికుంట, రామచంద్రాపురం ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతులను సీపీఎం నాయకులు శ్రమదానంతో పూడ్చారు. గొడుగు నాగేశ్వరరావు ఇంటి సమీపంలో, తోట వెంకటయ్య ఇంటి వద్ద మూలమలుపులో పెద్ద గోతులు ఏర్పడి బైకులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో కంకర, సిమెంట్, ఇసుకతో తాత్కాలికంగా పూడ్చారు. మల్లెలమడుగు సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి దండి రాములు, గొడుగు వెంకన్న, స్వర్గం వీరరాఘవులు, బొడ్డు రాములు, బొమ్మరాతి రామయ్య, రామచంద్రపురం రైతు సంఘం మండల అధ్యక్షుడు బద్దం సమ్మిరెడ్డి, పగడాల అశోక్‌రెడ్డి, తూము వెంకన్న, మొండికుంట నాయకుడు పినికేసి సుధాకర్‌రెడ్డి తదితరులు శ్రమదానంతో పాల్గొన్నారు. ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించి గోతులు పూడ్చిన సీపీఎం నాయకులను స్థానికులు అభినందించారు. రహదారిని శాశ్వతంగా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అన్ని దానాల్లో అన్నదానం మిన్న



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా చంద్రుగొండ బాలుమిల్లు వీధిలో వీధివాసుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఒకే రకమైన పట్టువస్త్రాలు ధరించి అన్నదానంలో పాల్గొన్నారు. అన్ని దానాల్లో అన్నదానం మిన్న అనే భావనతో భక్తులకు అన్నప్రసాదం అందించారు. మండలంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాల నడుమ పురవీధుల్లో గణేష్ విగ్రహాన్ని ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో గణేష్ మండప కమిటీ సభ్యులు నరుకుళ్ల సత్యనారాయణ, రంగబాబు, నరుకుళ్ల వాసు, భద్రరావు, బీఆర్ఎస్ నాయకులు సూరా వెంకటేశ్వర్లు, వంకాయలపాటి బాబురావు, సత్తి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

# చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యా దీవెన కార్యక్రమంలో భాగంగా పెద్దనల్లబెల్లి, కె లక్ష్మీ పురం గ్రామాల్లోని గణేష్ మండపాల వద్ద చిన్నారులకు సామగ్రిని పంపిణీ చేశారు. చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకులు శివ నాగస్వామి ఆధ్వర్యంలో సుమారు 80 మంది చిన్నారులకు రూ 15వేల విలువైన నోట్ బుక్స్, పెన్స్ అందజేశారు. పేద కుటుంబాల పిల్లలను విద్యలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు శివ నాగస్వామి తెలిపారు. చిన్నారులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కనుబుద్ది దేవా, రెండెండ్ల ప్రభాకర్‌రెడ్డి, మహేష్ బాబు, నవీన్‌రెడ్డి, పండుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలగూడెం పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ అందజేత



**ప్రజాపక్షం/కూసుమంచి:** ముత్యాలగూడెం పాఠశాలలో ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తమలోని వివిధ నైపుణ్యాలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రదర్శించగా, వారు అభినందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పీఎస్ఆర్ ట్రస్ట్ అందజేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను సర్పంచ్ అశోక్ ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్యూరిఫైయర్ అందించిన ట్రస్ట్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈకార్యక్రమంలో ఏపీసీ ఛైర్మన్ సురాంబ, సర్పంచ్ అశోక్, గ్రామ పెద్ద వాసు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సుజాతనగర్‌లో రియల్ ఎస్టేట్‌కు రెక్కలు

**-కార్పొరేషన్ హోదాతో అభివృద్ధికి కొత్త ఊపు**
**-విమానాశ్రయ ప్రతిపాదనతో పెరిగిన ఆసక్తి**
**-రోడ్లు, మౌలిక వసతులు.. భవిష్యత్ పట్టణీకరణపై ఆశలు**





**ప్రజాపక్షం/సుజాతనగర్:** ఒకప్పుడు గ్రామీణ ప్రాంతంగా ఉన్న సుజాతనగర్.. ఇప్పుడు పట్టణాభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో సుజాతనగర్ మండలంలోని పలు గ్రామాలు విలీనం కావడంతో ప్రాంత స్వరూపమే మారుతోంది. కార్పొరేషన్ పరిధిలో సుజాతనగర్ మండలానికి నాలుగు డివిజన్లు ఏర్పాటయ్యాయి. దీనికి తోడు ప్రభుత్వం కొత్తగూడెం పాల్వంచ సుజాతనగర్ ప్రాంతాలను కలిపి గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వాణిజ్య కేంద్రాలు, నివాస ప్రాంతాల అభివృద్ధికి భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉంది. విమానాశ్రయంతో మరింత ఆసక్తిభద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సంబంధించి సుజాతనగర్ ప్రాంతం కూడా అనుకూల ప్రాంతంగా గుర్తించబడింది. ఆరు ప్రాంతాలను పరిశీలించిన అధ్యయనంలో సుజాతనగర్, సీతంపేట ప్రాంతాలు అనుకూలంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. తాజాగా ప్రతిపాదిత ప్రాంతాల్లో సాంకేతిక నిపుణుల బృందాలు క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాయి. విమానాశ్రయం ఇంకా తుది నిర్ణయానికి రాలేదనే విషయం ఉన్నప్పటికీ.. స్థల పరిశీలనలు, అనుసంధాన రహదారులు, పారిశ్రామిక వాణిజ్య అభివృద్ధి వంటి అంశాల కారణంగా సుజాతనగర్ చుట్టుపక్కల భూములపై రియల్ ఎస్టేట్ వర్గాలు, పెట్టుబడిదారుల దృష్టి పడుతోంది.

**అభివృద్ధి పనులతో మారుతున్న రూపురేఖలు...**

కార్పొరేషన్ ఏర్పాటు తర్వాత సుజాతనగర్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి పెరిగింది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలు ముందుకు వెళ్తున్నాయని స్థానిక నాయకులు చెబుతున్నారు.రోడ్ల అభివృద్ధి, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీటి వసతులు, ప్రభుత్వ గృహ నిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాలు మెరుగుపడితే నివాస ప్రాంతాల విస్తరణకు మరింత అవకాశం ఏర్పడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

**ప్లాట్లకు డిమాండ్ పెరిగే అవకాశం...**

కార్పొరేషన్ పరిధిలోకి రావడం, గ్రోత్ కారిడార్ ప్రతిపాదనలు, విమానాశ్రయ స్థల పరిశీలనలు వంటి అంశాలు ఒకేసారి తెరపైకి రావడంతో సుజాతనగర్ ప్రాంతంలో ప్లాట్లు, ఇళ్ల స్థలాలపై భవిష్యత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవారు చెబుతున్నారు. అయితే అభివృద్ధి ప్రాజెక్టులు పూర్తిగా అమలయ్యే వరకు భూముల ధరలు ఎంత మేరకు పెరుగుతాయనే విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేమని నిపుణులు సూచిస్తున్నారు. భూమి కొనుగోలు చేసే వారు లేఅవుట్ అనుమతులు, టైటిల్, రోడ్డు సదుపాయం, ప్రభుత్వ భూమి/అసైన్డ్ భూమి అంశాలు, సంబంధిత అనుమతులను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**సుజాతనగర్.. భవిష్యత్ పట్టణంగా..?**

కార్పొరేషన్ హోదా.. నాలుగు డివిజన్లు.. గ్రోత్ కారిడార్ ప్రణాళిక.. విమానాశ్రయ ప్రతిపాదన.. మౌలిక వసతుల అభివృద్ధిఇవన్నీ కలిసొస్తే సుజాతనగర్ భవిష్యత్‌లో మరింత పట్టణీకరణ దిశగా పయనించే అవకాశం కనిపిస్తోంది.ఇప్పటి వరకు అభివృద్ధి పునాది పడుతుండగా.. రాబోయే రోజుల్లో సుజాతనగర్ రియల్ ఎస్టేట్ రంగానికి కీలక ప్రాంతంగా మారుతుందా? అన్నది స్థానికంగా ఆసక్తికర చర్చగా మారింది.

# మండుతున్న ఎండలు.. పెరుగుతున్న ధరలు





కల్తీ సరుకులను తయారు చేసి తక్కువ ధరకు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఏది కల్తి ఏది నిజమైనదో తెలియక కొనుగోలుదారులు తికమకపడుతున్నారు.

**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లాపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపెడుతున్నది. వర్షాకాలంలోనూ ఎండలు మండిపోతున్నాయి. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసే వర్షాలకు చెరువులు, కుంటలు తదితర జలాశయాలు అలుగులు దుంకి జలకళను సంతరించుకొనేవి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేకపోవటంతో చెరువులు, వరి చేలు చినుకుల కోసం ఎదిరిచూస్తున్నాయి. వర్షాలు కురిసే నాలుగు నెలల కాలంలో ఎండలు దంచి కొడుతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మే నెల ఎండలను మైమరిపిస్తున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. వ్యవసాయ కూలీలు, నిర్మాణరంగ, ఇతరత్రా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనికి వెళ్ళాలంటే భయపడిపోతున్నారు. సరైన సమయంలో వర్షాలు లేకపోవటంతో పంట దిగుబడి వస్తుందో రాదో అనే మీమాంసతో రైతాంగం గుబులు పడుతోంది. రైతులు అప్పుల పాలవుతామనే దిగులు పడుతున్నారు.

**- పెరుగుతున్న ధరలు :**

జిల్లాలో ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కొనసాగుతున్నది. దీనితో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ధరలు పెంచేస్తున్నారు. 50 రూపాయలు ఉన్న బియ్యం ధరలను 70కి పెంచారు. 115 రూపాయలు పలికిన వంటనూనె 200కు పెరిగి వంటింట్లో సెగపెడుతున్నది. 48 ధర ఉన్న చెక్కెర 70కి చేరింది. 25 రూపాయలకు లభ్యమయ్యే ఉల్లి ధర 65 రూపాయలు పలుకుతోంది. కొనుగోలు చేయకముందే ఘాటెక్కిస్తున్నది. నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు పెరిగిపోతూ ఆకాశాన్ని తాకుతున్నాయి. దీనిని ఆసరా చేసుకొంటున్న కొందరు వ్యక్తులు

**- వానా కాలంలో ఎండలు :**

ఎండాకాలంలో అకాల వర్షాల తరహా వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి. నాలుగు నెలల పాటు వర్షాలతో వాతావరణం చల్లగా ఉంటుంది. దానికి భిన్నంగా ఎండలు దంచి కొడుతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుతోందని ప్రచారం. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఏసీలు, కూలర్‌లను ఆశ్రయిస్తున్నారు. దీనితో విద్యుత్ వినియోగం అమాంతం పెరుతున్నదని సమాచారం. వానాకాలంలో ఎండల ప్రభావం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రేయిన్ సీజన్‌లో ఎండలు తీవ్రతరమవుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకొంటున్న మార్పులతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**- పట్టించుకోని పాలకులు :**

ఎల్‌నినో రాష్ట్ర వ్యాప్తంగా తమ ప్రతాపాన్ని చూపెడుతున్నది. దీనితో వర్షాలు లేక ఎండలు మండిపోతున్నాయి. వ్యాపారులు దూర దృష్టితో సరుకులను కృత్రిమ కొరత సృష్టించి ఉల్లి, చెక్కర , బియ్యం ధరలను ఇబ్బడిమబ్బడిగా పెంచారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నా పాలకులకు చీమ కుట్టినట్టుగా లేదని పేదలు మండిపడుతున్నారు. ధరలను అదుపు చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పంధించి ఆకాశాన్నంటిని ఉల్లి, చెక్కర, బియ్యం దరలను అదుపుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తల్లాడ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎస్ రెడ్డి, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. తల్లాడ మండలం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బోడ శ్రీను, కోడూరు వీరకృష్ణ, కార్యదర్శిగా దిరిశాల వీరభద్రం, కోశాధికారిగా తెల్లాపుట్ట వెంకటనారాయణ, సహాయ కార్యదర్శిగా షేక్ మేహారాజ్‌లను ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా రావుల గోపిగౌడ్, సత్తుపల్లి నియోజక వర్గ ఇంచార్జిలుగా నారపోగు ప్రసాద్, చిత్తలూరి రమేష్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, బాబు, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, లాలయ్య, ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, తల్లాడ సొసైటీ అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి లు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ గ్రామ పంచాయతీ మాజీ ఈడిసి ఛైర్మన్ దగ్గుల శ్రీనివాస రెడ్డి, రాంబాబు, తల్లాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుడిపల్లి నారాయణ, అప్పిరెడ్డి, నాగయ్య, కృష్ణార్జున, సత్యనారాయణ, నర్సింహారావు, ఉపేందర్, రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకట రామారావు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఆపతి వెంకట రామారావు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్తుపల్లి నియోజక వర్గంలోని వేంసూరు మండలం పల్లెవాడ గ్రామంలో బిజెపి సీనియర్ నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య, వ్యవసాయ క్షేత్రంలో కిసాన్ మోర్చా ఖమ్మంజిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కిసాన్ మోర్చా సమావేశం ఆదివారం నిర్వహించారు. బిజెపి కిసాన్ మోర్చా ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆపతి వెంకట రామారావును నియమిస్తూ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్, సీనియర్ నాయకులు సుబ్బారావు, రవికుమార్ పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ నగర్‌లో మహా అన్నదానం



**ప్రజాపక్షం/తల్లాడ :** ఎన్‌టిఆర్ నగర్‌లో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా కాలనీ వాసులు, చిన్నారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి అవసరమైన బియ్యాన్ని దాతలు మునుకూరు అప్పిరెడ్డి, ఎస్‌కె సైదులు అందించారు. వారి సహకారాన్ని నిర్వాహకులు అభినందించారు. పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్రోత్సహిస్తూ పూజా కార్యక్రమాల్లో భాగస్వాములైన కాలనీవాసులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, ఆసిఫ్, శైలజ, జయరాజు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లంకా శేషయ్య బంజర గ్రామానికి చెందిన గొర్రెపర్తి నాగేశ్వరావు (30) ఆదివారం దగ్గర్లోని పామాయిల్ తోటలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతిని భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం నాటి నుండి నేటి వరకు మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతునికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.